క్లుప్తంగా

వన్‌స్టాప్ సెంటర్‌లో సౌకర్యాలపై ఆరా



వన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): స్థానిక ప్రభుత్వ ప్రజా వైద్యశాల ప్రాంగణంలోని వన్ స్టాప్ సెంటర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం సందర్శించారు. వన్‌స్టాప్ సెంటర్లో బాధితులకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరమైతే న్యాయ సేవాధికార సంస్థలు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ నిర్మల, ప్యానల్ లాయర్ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందువుల్లో చైతన్యం నింపేందుకే శంఖారావం



స్వామీజీ పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందువుల్లో చైతన్యం నింపేందుకే హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అడబాల దుర్గాప్రసాద్, సీతారామ రాజు స్వామీజీ అన్నారు. ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి పాదయాత్రగా బయలుదేరిన స్వామీజీ గురువారం సాయంత్రం ఏలూరు చేరుకున్నారు. స్థానిక జూట్‌మిల్లు వద్ద ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద స్వామీజీకి ఏలూరులోని హిందూ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ప్రతి హిందువూ హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని స్వామీజీ పిలుపునిచ్చారు. రామనపూడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యారేజీ బ్యాగుల పంపిణీ

ఉంగుటూరు: యూటీఎఫ్ ఉంగుటూరు మండలం శాఖ ఆధ్వర్యంలో 300 క్యారేజీ బ్యాగులను ఉపాధ్యాయులకు, విద్యా శాఖ కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వీటిని పీవీ అప్పారావు, సునీల్, బేబి సరోజిని, తోట మూర్తిరాజుల వితరణతో శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతకు అందని సాయం

- నిరాశ పర్చిన 'సుఖీభవ'
- హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్ మిగిల్చిన అప్పులు
- రైతులకు ఆర్థిక ఇబ్బందులు



కొత్తూరు రోడ్డుపక్క చేలలో ధాన్యం సేకరిస్తున్న రైతులు



వెంకటాపురంలో కుప్పలుగా పోసిన ధాన్యం మధ్య పెసర పంట

ఏలూరు రూరల్ : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు వ్యవసాయం పెట్టుబడి అందిస్తానని హామీ ఇచ్చింది. ఈ ఖరీఫ్‌కు ఆర్థిక సాయం చేస్తుందని ఆశ పడ్డ రైతులకు నిరాశే మిగిలింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటేటా పెరుగుతునే ఉన్నాయి. కాని, ధాన్యం ధర పెరగడంలేదు. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటను రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పరిస్థితి అధ్వానం

ఏలూరు అర్బన్, ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో సాగుదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ మాత్రమే సాగు చేశారు. నీటి ఎద్దడి కారణంగా రబీ సాగుకు నీరు ఇవ్వలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో రైతులు ఖరీఫ్‌లో సాధించిన దిగుబడితో అప్పులు తీర్చుకుంటున్నారు. వెంకటాపురం, చొదిమెళ్ల, పోణంగి, మాదేపల్లి, మల్కాపురం, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు తదితర గ్రామాల్లో 6,532 ఎకరాల్లో వరి సాగు చేశారు. చొదిమెళ్లలో ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చింది. వెంకటాపురం, పోణంగి, మాదేపల్లి శివారు ప్రాంతాల్లో రైతులు ఎకరానికి 30 నుంచి 32 బస్తాలు దిగుబడి సాధించారు.

కౌలుదారుడుకి గడ్డే

వరిసాగులో కౌలుదారుడుకు అప్పులే మిగులుతున్నాయి. ఏలూరు రూరల్ మండలంలో సరాసరి ఎకరానికి 35 బస్తాల దిగుబడి వచ్చింది. ఇందులో చేలను బట్టి ఎకరానికి 14 నుంచి 16 బస్తాలు కౌలు చెల్లిస్తున్నారు. ఇక మిగిలింది సుమారుగా 20 బస్తాలు. ప్రభుత్వం క్వింటాకు రూ.1750 చెల్లిస్తుంది. అంటే 20 బస్తాలకి రూ.35 వేలు చేతికొస్తున్నాయి. ఖరీఫ్‌లో ఎకరానికి రూ.33 వేల నుంచి రూ.36 వేలు పెట్టుబడి పెట్టారు. ఈ మొత్తం తీసుకెళ్లి పెట్టుబడిదారుడు చేతిలో పెడుతున్నాడు. అఖరికి కౌలుదారుడుకి మిగిలేది ఎండి గడ్డి మాత్రమే. ఈ గడ్డితో పశువులు మేపుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఇదంతా ప్రకృతి కరుణిస్తే సుమ. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్లు, వరదలు వస్తే పెట్టుబడి కూడా దక్కే చాన్సేలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోతాడు.

ఎకరానికి రూ.32 వేలు ఖర్చు



ఎకరం పొలం ఐదు సార్లు దుక్కిదున్నాలంటే రూ.5 వేలు, విత్తనాలకు రూ.1200. గట్లు కొట్టడం, బాగుజేతకు రూ.2 వేలు, ఊడ్పు, ఆకుతీతకు రూ.5800, మూడు సార్లు యూరియా, డీఏపీ వేసేందుకు రూ.2 వేలు. ఇక గుళికలు చల్లడం, కలుపుతీతకు మరో రూ.2 వేలు ఖర్చు అవుతోంది. పంట కోతకు రూ.4500 వేలు, కట్టేతకు రూ.4 వేలు, పన తిరగేతకు 600, మిషన్‌కు రూ.4500. మొత్తంగా ఎకరానికి రూ.32 వేలు నుంచి రూ.35 వేలు పెట్టుబడి అయ్యింది. కౌలు పోతే మిగిలేది. ఏమీ లేదు.

– పిల్లగోల సాయి, కౌలుదారుడు

ప్రభుత్వమే ఆదుకోవాలి



వ్యవసాయం మాకు వ్యసనమైపోయింది. గత్యంతరం లేక వ్యవసాయం చేస్తున్నాం. వరి సాగు తప్ప ఏమీ చేయలేం. ఎన్ని కష్టాలు పడ్డా మిగిలేది ఏమీ లేదు. రబీకి నీరు లేదన్నారు. దీంతో పెసలు చల్లాను. నాలుగు బస్తాలు పండుతుందని ఆశ పడుతున్నా. బాగా పండితే రూ.4 వేలు మిగులుతాయి. లేదంటే ఏమీ లేదు. ప్రభుత్వ ఆర్థిక సాయం చేస్తేనే రైతు వ్యవసాయం చేయగలం. లేకపోతే చేసేది ఏమీ లేదు. కూలి నాలి చేసుకోవల్సిందే.

– పాలెం గణేష్, కౌలుదారుడు, వెంకటాపురం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్ స్టేషన్ సెంటర్, కేబీ సింగ్ రోడ్, కట్టా సుబ్బారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్ : శనివారపుపేట జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జయకేతనం స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదవి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ డీవీ రమణ, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, బీఎస్ఎన్ఎల్ అడ్వైజింగ్ కమిటీ సభ్యుడు లంకపల్లి మాణిక్యాలరావు, ఘంటా ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బైక్ ర్యాలీ

ఉంగుటూరు: విజయవాడలో ఈ నెల 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. గోపాలపురం, పందిరెడ్డిగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, ఎర్రమిల్లిపాడు, కంసాలిగుంట, కొత్తగూడెం, గోపినాథపట్నం కాలనీ, గొల్లగూడెం గ్రామాల్లో ర్యాలీ కొనసాగింది.

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల ధర్నా



ఏలూరు కార్పొరేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు జీఓ 7 ప్రకారం రూ.15,000 కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాదులు మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గతేడాది ఇదే రోజున 16 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారని, ఆ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ఈనెల 2న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించలేదని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు రోడ్డెక్కారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి సమస్యలను పరిష్కారం చేయాలని, లేని పక్షంలో మరోసారి రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆయా యూనియన్ల నాయకులు లావేటి కృష్ణారావు, ఎ.జానుబాబు, వినుకొండ రమేష్, బండి భవాని, ఎన్ నాగమణి, దుర్గ, గౌసియాలు మాట్లాడారు. కార్యక్రమానికి బి.సోమయ్య అధ్యక్షత వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు అందజేశారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే





ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూలే దంపతులకు నివాళి, సెయింట్ థెరిస్సా కాలేజీలో నివాళులర్పిస్తున్న అతిథులు

ఏలూరు (టూటౌన్): చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 194వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించినారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లో పూలే దంపతుల విగ్రహాల వద్ద పలు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టీచర్స్ డేగా ప్రకటించాలని, ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాగంటి సంజీవ్ మాట్లాడుతూ పూలేదంపతుల సేవలను కొనియాడారు.

- ఆర్‌ఆర్‌పేటలోని చేనేత సంఘ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. విద్యతోనే సమాజం పురోభివృద్ధి సాధిస్తుందని నమ్మిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జీసీ జేఏసీ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం, పలువురు బీసీ సంఘాల నాయకులు కొనియాడారు.
- బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బోఫ్) ఆధ్వర్యంలో క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. బోస్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడారు.

మహిళాభ్యుదయానికి విశేష కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మహిళాభ్యుదయానికి భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని వక్తలు అన్నారు. స్థానిక రామచంద్రరావు పేటలోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని మానవత ఏలూరు యూనిట్, సెట్‌వెల్ (యువజన సర్వీసుల శాఖ)ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్, మానవత ఏలూరు యూనిట్ నాయకులు పోదూరి కనకదుర్గ, మేతర అజయ్ బాబు, పోలవరపు రత్నాకరరావు, వల్లూరుపల్లి సాయిసుధ, పైడి కస్తూరి బాయి, అల్లూరి మోహిని, ప్రధానోపాధ్యాయుడు ద్రోణాదుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

- సావిత్రిబాయి పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు.
- పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు పువ్వుల ఆంజనేయులు, పామర్తి ఏసురాజు, ఎం. రాంబాబు, కాకి నాని, ఎం .యశ్వంత్, పసుపులేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	40
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	32	కంద	60
కాకర కాయలు	40-44	బీట్‌రూట్	46
బీరకాయలు	32	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	50	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	70
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	42	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	32	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

మంత్రిని కలిసిన ఎన్‌జీవోస్ నాయకులు



మంత్రి రామానాయుడిని కలిసిన ఏపీఎన్‌జీవోస్ నాయకులు

ఏలూరు(మెట్రో): విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీజీవోస్ అసోసియేషన్ నాయకులు కేవీ శివారెడ్డి, అలపర్తి విద్యాసాగర్, చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, ఆర్ఎస్ హరనాథ్, ఆర్నెపల్లి రంగారావు, కిలారు జగదీశ్వరరావు, డేగల వెంకటరమణ, ఘంటసాల శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, రమేష్, లంకేశ్వరుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అవార్డు

ఏలూరు (టూటౌన్): జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని పూలే అవార్డుతో సత్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను పూలే అవార్డుతో బీసీ సంఘాల నాయకులు సత్కరించారు. సంఘం అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, జేఏసీ ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ మాట్లాడారు.

పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు

ద్వారకాతిరుమల: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా, పశుగణాభివృద్ధి సంస్థ (పెంటపాడు) ఆధ్వర్యంలో మండలంలోని ఎం.నాగులపల్లిలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామంలోని మినీ గోకులాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు 54 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. అలాగే 45 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులకు లివర్ టానిక్, మినరల్ మిక్చర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి.గోవిందరాజు, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ జేసురత్నం, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ క్రాంతి కిరణ్, ద్వారకాతిరుమల మండల పశు వైద్యాధికారి అంగర సురేష్, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట) : స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సాయంకాల పూజలు నిర్వహించారు. 5.30 గంటలకు మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మ రామాయణం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. 6.30 గంటల నుంచి పరిమి సావిత్రి, ఎన్‌వీ గంగాభవాని శ్రీరామ కథామృత గానం పేరిట భక్తి సంకీర్తనలు ఆలపించారు. రాత్రి 8 గంటల నుంచి నగరానికి చెందిన నవ్యశ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మళ్లీ అధికారం వైఎస్సార్‌సీపీదే

గణపవరం: అబద్దాలతో ప్రజలను నమ్మించి అధికార పీఠమెక్కిన కూటమి ప్రభుత్వంపై ఆరునెలల్లోనే ప్రజల భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని, మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదేనని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఆయనను వైఎస్సార్ సీపీలో జిల్లా పదవుల్లో నియమితులైన నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆయన్ని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వాసుబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. తమపై నమ్మకంతో వివిధ పదవుల్లో నియమించినందుకు వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వాసుబాబును కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కందులపాటి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పాతూరి శ్రీనివాసరాజు, జిల్లా కార్యదర్శులుగా కరణం బుజ్జి, నల్లమాడు రవికుమార్, సెక్రటరీ యాక్టివిటీగా పాతంశెట్టి శ్రీను, బండి ఇస్సాకు, జిల్లా అధికార ప్రతినిధిగా భీమడోలు ఏఎంసీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ ఉన్నారు.

వాసుబాబును కలిసిన నీలిమ

భీమడోలు: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పూళ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు కందులపాటి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధిగా భీమడోలు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంజేటి నీలిమ జూనియర్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వాసుబాబుకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాలిని

ఏలూరు (టూటౌన్): ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకమని, వారు చేసే పరీక్షల ద్వారా రోగి ఏ వ్యాధితో బాధపడుతున్నాడో గుర్తించగలమని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని అన్నారు. స్థానిక ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ల్యాబ్ టెక్నీషియన్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్లు అంకితభావంతో పనిచేసి ప్రాథమిక ఆరోగ్యంద్రాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎక్కువ రక్త, మూత్ర పరీక్ష చేసి జిల్లా గ్రేడింగ్‌ను పెంచాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు రోగులను భయపెట్టకుండా ధైర్యపరచాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ నిర్మూలనలో ల్యాబ్ టెక్నీషియన్ పాత్ర కీలకమన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.